క్లుప్తంగా

సాఫ్ట్ బాల్ జిల్లా జట్టుకు సెయింటాన్స్ విద్యార్థులు



క్రోసూరు: నరసారావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాల గ్రౌండ్ నందు జరిగిన అండర్ 14 బాల బాలికల సాఫ్ట్ బాల్ జిల్లా జట్టు ఎంపికలో క్రోసూరు సెయింటాన్స్ పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్స్‌పల్ సిస్టర్ మేరీ రజిత ఆదివారం తెలిపారు. విద్యార్థులు జి.తనూజ, బి.చందన, కె.దీవెన ఏంజెల్ ఎంపికై నట్లు చెప్పారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో చిత్తూరులో జరిగే అంతర్జిల్లాల పోటీల్లో పాల్గొననున్నట్లు ఆమె వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్స్‌పల్, వ్యాయామ ఉపాధ్యాయుడు మక్కెన వెంకట్రావు, ఉపాధ్యాయులు తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించాలని కోరుతూ అభినందించారు.

నిబంధనలు పాటించాలి



ఎస్ఐ చల్లా సురేష్

నకరికల్లు: రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ చల్లా సురేష్ వాహనదారులకు ఆదివారం సూచించారు. నకరికల్లు నుంచి నరసరావుపేట రోడ్డులో శాంతి నగర్ వరకు పలుచోట్ల ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. హైవే పక్కన ఉన్న గ్రామాల్లో వేగాన్ని నియంత్రించుకోవాలన్నారు. ద్విచక్ర వాహనాలను 18 ఏళ్లలోపు పిల్లలకు ఇవ్వకూడదని మైనర్‌లకు వాహనాలిస్తే ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఊళ్లకు వెళ్లేవారు ఇళ్లకు తాళాలు జాగ్రత్తగా వేసుకోవాలని, చుట్టపక్కల వారికి సమాచారమిచ్చి వెళితే కొంతమేర చోరీలు జరుగకుండా అప్రమత్తంగా ఉండవచ్చన్నారు. నిబంధనలు, సూచనలు పాటిస్తే చోరీలు, రోడ్డు ప్రమాదాల నుంచి బయట పడవచ్చన్నారు.

నీట మునిగిన పంట పొలాలు



పిడుగురాళ్లరూరల్: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని అన్ని గ్రా మాల్లో పొలాలు ముంపునకు గురయ్యాయి. ఆదివారం కూడా వర్షం కురవటంతో చేలు నీటితో నిండిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి పంటలో పూత, పిందె రాలుతుందని, కంది పంట తెలుపు రంగులో మారుతోందని, మిరప ఉడకెత్తి పంట చేతికి వస్తుందో రాదో అని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మునమాక గ్రామ సర్పంచ్ మృతి

రొంపిచర్ల : మండలంలో మునమాక గ్రామ సర్పంచ్ సయ్యద్ జాన్ సైదా (45) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. నరసరావుపేట మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గ్రామ సర్పంచ్‌గా, వైఎస్సార్ సీపీ నాయకుడిగా జాన్ సైదా గ్రామాభివృద్ధికి, పార్టీ బలోపేతానికి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు చక్రారెడ్డి, పానుగోటి వెంకట్రావు, పడాల హనిమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

నాదెండ్ల: జాతీయ రహదారి గణపవరం గ్రామ పరిధిలోని వీరా అసోసియేట్స్ స్పిన్నింగ్ మిల్లు సమీపంలో శనివారం అర్ధరాత్రి వృద్ధుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గుర్తుతెలియని మృతదేహంగా పోలీసులు వివరాలు నమోదు చేసుకుని చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే మృతుడు పెదనందిపాడుకు చెందిన వేలూరి సుబ్బారావు (65)గా గుర్తించారు. కొద్దిరోజులుగా మతిస్థిమితం కోల్పోయి శుక్రవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడని, శనివారం అర్ధరాత్రి 2.30– 3 గంటల సమయంలో జాతీయ రహదారిపై ప్రమాదంలో మరణించినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి కుమార్తె స్వప్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శంకర సత్సంగం పునరుద్ధరణ

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని సన్నిధి వారి వీధిలో ఉన్న సన్నిధి వెంకట ఆంజనేయులు, నాసరమ్మ గార్ల ధ్యాన మందిరంలో ఆదివారం శ్రీ శంకర సత్సంగం పునరుద్ధరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా సిద్దేశ్వరం సమీపంలోని పునుగోడు గ్రామానికి చెందిన శుద్ధ చైతన్యానంద స్వామీజీ, శిష్య బృందం గురుపూజ చేశారు. అనంతరం ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. శంకర సత్సంగం నిర్వాహకురాలు తెలగంశెట్టి పావనిదేవి మాట్లాడుతూ గత 33 సంవత్సరాలుగా మేము ఇక్కడ సత్సంగం నిర్వహిస్తున్నామని, ఇటీవల ఈ ధ్యాన మందిరం ఆధునీకరణ చేసి ప్రారంభించినట్లు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికుల పొట్టగొట్టారు

- జీవనాధారం కోల్పోయిన కార్మికులు
- అలంకారప్రాయంగా డంపింగ్ యార్డులు
- పేరుకుపోతున్న చెత్త కుప్పలు
- అవస్థలు పడుతున్న ప్రజలు



నిరుపయోగంగా ఉన్న చెత్తం నుంచి సంపద తయారీ కేంద్రం

రాజుపాలెం: చాలీచాలని వేతనంతో తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ప్రజా ఆరోగ్యమే ధ్యేయంగా పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులపై కూటమి ప్రభుత్వం కన్నెర్రజేసింది. వారి పొట్టకొట్టి ఉసురు పోసుకుంది. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గ్రామాల్లో పనిచేసే కొంతమంది పారిశుద్ధ్య కార్మికులను రాజకీయ జోక్యంతో నిర్దాక్షిణ్యంగా తొలగించారు. కొన్ని గ్రామాల్లో అధికార పార్టీకి అనుకూలంగా ఉన్నవారిని ఉంచారు. కార్మికులను తొలగించడంతో వారి జీవనోపాధి కోల్పోయి.. కుటుంబాలు నానా అవస్థలు పడుతున్నాయి. ప్రతీ గ్రామంలో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. కార్మికులు లేకపోవడంతో రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. దీంతో దుర్వాసన వెదజల్లుతూ..అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి.



నిరుపయోగంగా ఉన్న నాడెప్ తొట్టెలు

జీవనాధారం కోల్పోయిన కార్మికులు



రహదారి ప్రక్కనే చెత్తా చెదారం

గత ప్రభుత్వంలో 17 గ్రామ పంచాయతీల్లో 64 మంది పారిశుద్ధ్య కార్మికులను నియమించారు. జనాభా ఎక్కువగా గ్రామాల్లో 6 నుంచి 8 మందిని, చిన్న గ్రామాలైతే 2 నుంచి ఆరుగురు కార్మికులను నియమించారు. వీరు ప్రతి రోజు ఉదయం 5 నుంచి 9 గంటల వరకు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించి, డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. తడి, పొడి చెత్తగా వేరు చేసి నాడెప్ తొట్లలో వేస్తారు. ఒక్కొక్క కార్మికుడికి నెలకు రూ.6 వేలు పంచాయతీ నిధుల నుంచి చెల్లిస్తారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 17 గ్రామ పంచాయతీల్లో పని చేసిన 64 మంది కార్మికులకు గాను 37 మందిని తొలగించారు. వారి కుటుంబాలు జీవనోపాధి కోల్పోవడంతో అవస్థలు పడుతున్నారు. కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలందించారు. ఇంటింటికి కావాల్సిన నిత్యవసర వస్తువులను కూడా అందించారు. కార్మికులను తొలగిండంతో రిక్షా బండ్లు, చెత్త తరలించే వ్యాన్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి.

నిర్దాక్షిణ్యంగా తొలగించారు



గత ప్రభుత్వంలో నాలుగేళ్ల పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేశాను. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రామంలో ఇంటింటా తిరిగి చెత్తా చెదారం సేకరించి, డంపింగ్ యార్డుకు తరలించాం. గ్రామంలో నలుగురిని కార్మికులుగా నియమించారు. ఎలాంటి రిమార్కు లేకుండా పనిచేశాం. వైఎస్సార్ సీపీ సానుభూతి పరులని ముగ్గురుని తొలగించారు. అందులో నేనొకడిని.

– బొక్కా రాములు, కార్మికుడు, ఇనిమెట్ల

జీవనాధారం పోయింది



పారిశుద్ధ్య కార్మికుడినైన నన్ను తొలగించడంతో జీవనాధారం పోయింది. రోజూ వేరే గ్రామాలకు పనికి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. నా కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. జీతం ఆలస్యమైన గుండె నిబ్బరంతో పనిచేశా. గ్రామంలో ఐదుగురుని పారిశుద్ధ్య కార్మికులుగా నియమించారు. మాతో పాటు వ్యాన్ డ్రైవర్‌ను కూడా నియమించారు. అందరిని తొలగించడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం.

– మల్లెల వీరాస్వామి, కార్మికుడు, రాజుపాలెం

మాదల రైతుకు అవార్డు ప్రదానం



గోగినేని కోటేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ గోగినేని కోటేశ్వరరావు రైతు నేస్తం ఉత్తమ రైతుగా ఎంపికయ్యారు. కృష్ణా జిల్లా గన్నవరం, ఆత్కూరులోని స్వర్ణ భారత్ ట్రస్ట్, ముప్పవరపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతు నేస్తం 20 వార్షికోత్సవాల సందర్భంగా రైతు నేస్తం–2024 పురస్కారాలు ఉత్తమ రైతులకు ఆదివారం అందజేశారు. భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అవార్డును గోగినేని కోటేశ్వరరావు స్వీకరించారు. సంప్రదాయ సాగు జ్ఞానానికి కాలానుగుణంగా శాస్త్ర విజ్ఞానం జోడించి, సహజ ప్రకృతి వనరులు కాపాడుకుంటూ సేంద్రియ పద్ధతులను ప్రోత్సహించేలా చేపట్టిన ఆవుల పెంపకం చేపట్టినందుకు గాను ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా గోగినేని కోటేశ్వరరావు, రామతులశమ్మ దంపతులను దుశ్శాలువా, పూల మాలలతో ఘనంగా సత్కరించి అవార్డును వెంకయ్యనాయుడు అందించారు.

దూషించిన వారిపై చర్యలు తీసుకోండి

సత్తెనపల్లి: ప్రజాస్వామ్యయుతంగా, విధాన పరంగా చేసిన విమర్శలపై అసభ్య పదజాలంతో దూషిస్తూ సమాజంలో తన ప్రతిష్టను దెబ్బతీసేలా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావు ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత 25 సంవత్సరాలుగా న్యాయవాది వృత్తిలో ఉంటూ ఏడేళ్లుగా సామాజిక మాధ్యమంలో అనేక అన్యాయాలను, దుర్మార్గాలను ప్రశ్నిస్తూ పార్టీలకు అతీతంగా పోరాడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మూడు రోజుల క్రితం పల్లె పండుగ అధికారిక కార్యక్రమంలో మాజీ వైసీపీ నాయకులు, ప్రముఖ కాంట్రాక్టర్ దరువూరి నాగేశ్వరరావు పాల్గొని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయటాన్ని ప్రశ్నిస్తూ సోషల్ మీడియా పోస్టు చేశానన్నారు. సదరు పోస్టులో యెలినేడి రమేష్ చౌదరి అనే వ్యక్తి రాయడానికి వీలులేని విధంగా బండ బూతులు పెట్టాడన్నారు. రమేష్ చౌదరి తన ప్రొఫైల్‌లో పవన్ కల్యాణ్ ఫొటో, జనసేన పార్టీకి చెందిన వ్యక్తిగా ఫేక్ ఎకౌంట్‌తో దూషించినట్లు చెప్పారు. అతని వెనుక దరువూరి నాగేశ్వరరావు ఉన్నట్లుగా తన దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై విచారించి దోషులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

జానపాడు చేపల చెరువులో వ్యక్తి మృతదేహం

పిడుగురాళ్ల: మండలంలోని జానపాడు చేపల చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఆదివారం జరిగింది. సీఐ శ్రీరాం వెంకట్రావు కథనం ప్రకారం.. మండలంలోని జానపాడు గ్రామానికి చెందిన యానాల సుబ్బారావు మద్యానికి బానిసై తరచూ ఇంట్లో నుంచి వెళ్లిపోతాడని, ఈ నెల 12న ఇంట్లో నుంచి వెళ్లిపోగా కుటుంబ సభ్యులు బంధువుల ద్వారా సుబ్బారావు ఎక్కడ ఉన్నాడో తెలుసుకొని ఇంటికి తీసుకొని వచ్చారు. నాలుగు రోజుల క్రితం మళ్లీ సుబ్బారావు ఇంట్లో నుంచి వెళ్లిపోగా కుటుంబ సభ్యులు కూడా మళ్లీ తిరిగి వస్తాడని భావించారు.

కానీ ఆదివారం తెల్లవారుజామున జానపాడు చేపల చేరువులో మృతదేహం లభ్యం కావటంతో అటుగా చూసిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి అనవాళ్ల ప్రకారం సుబ్బారావు(44) మృతదేహంగా గుర్తించారు.

వెంటనే పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ వితరణ



ఇంజినీరింగ్ విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

అచ్చంపేట: ప్రతిభతో రాణిస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థి కూకట్లపల్లి ఆనంద్‌కుమార్‌కు మాగులూరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు మాగులూరి భాను ప్రకాష్ ఆదివారం ల్యాప్‌టాప్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ ఉండి పేదరికంతో ఎదగలేని విద్యార్థులకు తమ సంస్థ అండగా ఉంటుందన్నారు. కొత్తపల్లికి చెందిన ఆనంద్ కుమార్ ప్రతిభతో ఇంజనీరింగ్ ఫ్రీ సీటు సాధించి, మంచి మార్కులతో నాలుగు సంవత్సరాలు పూర్తి చేసినట్లు చెప్పారు. భవిష్యత్ అవసరాల నిమిత్తం విద్యార్థికి రూ.40వేలు విలువచేసే ల్యాప్‌టాప్, ఖర్చుల నిమిత్తం రూ.5వేలు నగదు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాగులూరి ఫౌండేషన్ సభ్యులు కృష్ణారావు, కొండవీటి ప్రసాద్, కుంచనపల్లి కిరణ్, కేపూరి సుబ్బారావు, ఏపూరి సీతారామయ్య, శ్రీనివాసరావు, వీరాంజనేయులు, నాగరాజు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఉద్యోగికి మదర్ థెరిస్సా పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న పీహెచ్‌సీ ఉద్యోగి వెంకట్రావు

అచ్చంపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ ఎడ్యుకేటర్‌గా పనిచేస్తున్న పోసిపోగు వెంకట్రావు మదర్ థెరిస్సా జాతీయ సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. సత్తెనపల్లి ఐఎం హాల్‌లో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు అవార్డు అందజేశారు. హెల్ప్ ఫౌండేషన్ వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి ఈ అవార్డు ప్రదానం చేస్తున్నట్లు చెప్పారు. వైద్య రంగానికి చెందిన తనకు ఈ పురస్కారం దక్కడం చాలా సంతోషంగా ఉందన్నారు. మదర్ థెరిస్సా పేరు మీదుగా జాతీయ పురస్కారం అందుకోవడం గర్వించదిగిన విషయమన్నారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్య వైద్యులు, సిబ్బంది, గ్రామ ప్రముఖులు అభినందించారు.

కోటయ్య సంస్మరణ సభను జయప్రదం చేయండి



ఆర్టీసీ బస్టాండ్ వద్ద కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

నరసరావుపేట: పల్నాటి పీడిత ప్రజల నాయకుడు, అమరుడు కామ్రేడ్ చల్లా (బరిసె) కోటయ్య సంస్మరణకు చెందిన కరపత్రాన్ని ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రజాసంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈనెల 7న దుర్గి మండలం అడిగొప్పల గ్రామంలో కోటయ్య తీవ్ర అనారోగ్యంతో అమరులయ్యారని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు చెప్పారు. పేద కుటుంబంలో పుట్టి గ్రామంలో భూస్వామ్య, అగ్రవర్ణ పెత్తందారులకు వ్యతిరేకంగా ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీల హక్కుల కోసం పోరాడి అనేక విజయాలు సాధించారని అన్నారు. ఈనెల 21 సోమవారం గ్రామంలో నిర్వహించే సంస్మరణ సభను జయప్రదం చేయాలని కోరారు. పీడీఎం రాష్ట్ర నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, పౌరహక్కుల సంఘం జిల్లా జాయింట్ సెక్రెటరీ సికినం చిన్న పాల్గొన్నారు.

రేషన్ మాఫియాకు అడ్డుకట్ట

చిలకలూరిపేట: నియోజకవర్గంలో రేషన్ మాఫియాకు ఇన్‌చార్జి తోట రాజారమేష్ చెప్పారు. నియోజకవర్గ పరిధిలో పలుమార్లు రేషన్ బియ్యం పట్టుబడిన నేపథ్యంలో పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి షేక్ సుభాని, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మునీర్‌హసన్ పాల్గొన్నారు.

రెండవ రోజు అట్ల తద్ది సద్ది ఊయల

పెదకూరపాడు: మండలంలో అట్ల తద్ది రెండవ రోజున ఆదివారం సద్ది ఉయ్యాల కార్యక్రమం నిర్వహించారు. శనివారం చంద్రుని చూసి వాయనం ఇచ్చి వ్రతం ముగించారు. ముత్తైదువలు అందరూ కలిసి ఉదయం సద్ది ఊయల ఊగారు. మహిళలు, చిన్నారులు ఉయ్యాల ఊగడానికి మహిళల జీవన విధానంలో ఆరోగ్య రహస్యాలు ఉన్నాయని పెద్దలు తెలిపారు. మహిళల కోసం గ్రామాల్లో పెద్ద ఎత్తున ఊయలలు ఏర్పాటు చేశారు.

నేడు ప్రజాదర్బార్

క్రోసూరు : ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి.మహేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు అర్జీలు అందించవచ్చని చెప్పారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆశ్రమానికి కారు వితరణ

పెదకూరపాడు: స్థానిక పాటి బండ్లలో మెర్సి హోం (కారుణ్య ఆశ్రమం)కు జోయలుక్కస్ ఫౌండేషన్ రూ.6లక్షల విలువైలన కారును వితరణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జోయ లూక్కాస్ గుంటూరు బ్రాంచ్ మేనేజరు ప్రకాష్, మార్కెటింగ్ మేనేజరు బాజి వాహనాన్ని మెర్సి హోమ్ నిర్వాహులు డాక్టర్ అల్లం ఇన్నారెడ్డి, శాంతికి అందించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ రాము పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

బెల్లంకొండ: మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించనున్న ఆధార్ క్యాంపులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వై.హనుమారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 22 నుండి 25వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 22న బెల్లంకొండ, 23న చిట్యాల, 24, 25న చండ్రాజుపాలెం గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ క్యాంపుల్లో ఆధార్‌లో మార్పులు చేర్పులు, బయో మెట్రిక్ అప్‌డేషన్ తదితర సేవలను అందిస్తారని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామాల ప్రజాప్రతినిధులు క్యాంపులపై గ్రామాల ప్రజలకు చైతన్యం కలిగించాలని కోరారు.

ఇన్నర్ వీల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మంజుల



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

చిలకలూరిపేట: పేదల ఆరోగ్య పరిరక్షణకు ఇన్నర్‌వీల్ క్లబ్ కృషి చేస్తుందని క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని తెలిపారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో పట్టణంలోని మంజూ నర్సింగ్ హోమ్‌లో సన్ ఫార్మా లేబరేటరీ సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా షుగర్, హెచ్‌బీఏ1సి, థైరాయిడ్, పాదాల న్యూరోపతి వైద్య పరీక్షలు నిర్వహించారు. షుగర్ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ మంజుల రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నార్నే జయలక్ష్మి, పూర్వ అధ్యక్షురాలు తియ్యగూర రమాదేవి, పోతినేని పద్మావతి పాల్గొన్నారు.

వైద్యశిబిరంలో 130మందికి పరీక్షలు

నరసరావుపేట: పట్టణ ఒడియరాజుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్స్ విజన్ కంటి వైద్యశాల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా వడ్డెర సంఘం నాయకులు తిరుమలకొండ నరసింహారావు సారథ్యంలో వడ్డెర కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన శిబిరంలో డాక్టర్ చెంచిరెడ్డి పాల్గొని 130మందికి కంటి పరీక్షలు చేశారు. మందులను ఉచితంగా పంపిణీ చేశారు. దేవల్ల వెంకటేశ్వరరావు, కుంచాల కోటేశ్వరరావు, కుంచాల శ్రీనివాసరావు, చల్లా శ్రీనివాసరావు, అచ్చి శివ కోటి, తన్నీరు శేఖర్ పాల్గొన్నారు.

పాఠశాలలను బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చాంద్ బాషా

నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వం పాఠశాల విద్యను బలోపేతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా తెలిపారు. పల్నాడురోడ్డులోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పల్నాడుజిల్లా కార్యవర్గ సమావేశంలో చాంద్‌బాషా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 117 జీఓను రద్దు చేసి 3,4,5, తరగతులను ఉన్నత పాఠశాలల నుంచి వెనక్కు తీసుకవచ్చి ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. ఉపాధ్యాయులు తమ వృత్తికి పునరంకితంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహమ్మద్ ఉస్మాన్, మక్కెన శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సయ్యద్ కరిముల్లా, మండల శాఖల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

రాజకీయ కారణాలతో ఉద్యోగుల తొలగింపు సరికాదు



శిబిరంలో దీక్ష చేస్తున్న వారికి సంఘీభావం తెలిపిన కోటేశ్వరరావు, జిలానీ మాలిక్


నరసరావుపేట: రాజకీయ కారణాలతో తొలగించిన మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పల్నాడు జిల్లా బాలోత్సవ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరావు కోరారు. తమను మళ్లీ ఉద్యోగంలోకి తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గత 18రోజులుగా మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరం నిర్వహిస్తున్న ఉద్యోగులను డీఎస్ఏ స్టేడియం మాజీ కమిటీ సభ్యుడు జిలానీ మాలిక్‌తో కలిసి సందర్శించి వారికి తమ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు శిలార్ మసూద్, పట్టణ కార్యదర్శి చిన్న అల్లాభక్షు, ఉద్యోగులు పాల్గొన్నారు.


వంతెన నిర్మాణం.. అంతరాయం లేని ప్రయాణం

క్రోసూరు: ఊటుకూరు కప్పల వాగుపై నిర్మిస్తున్న హై లెవల్ బ్రిడ్జి పూర్తి చేసుకుంటే ప్రజల ప్రయాణ కష్టాలు తీరుతాయి. అమరావతి మీదుగా గుంటూరు వెళ్లే వారికి మార్గం సుగమం అవుతుంది. ముఖ్యంగా అచ్చంపేట, క్రోసూరు ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. గత 25, 30 ఏళ్ల నుంచి చిన్నపాటి వర్షాలు కురిసినా కప్పల వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. అకస్మాత్తుగా వాగు పొంగి రాకపోకలు నిలిచిపోతుంటాయి.

పరిష్కారం చూపిన మాజీ ఎమ్మెల్యే

అచ్చంపేట, క్రోసూరు నుంచి గుంటూరుకు ఊటుకూరు గ్రామం మీదగా కప్పల వాగు దాటి వెళ్లాలి. క్రోసూరు నుంచి అమరావతి వరకు సుమారు పదికి పైగా గ్రామాలున్నాయి. మరికొన్ని గ్రామాలు పెదకూరపాడు వైపు ఉన్నాయి. ఈ గ్రామాల నుంచి విద్యార్థులు, ఉద్యోగులు నిత్యం ప్రయాణిస్తుంటారు. సమస్యను గుర్తించిన మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అమరావతి నుంచి బెల్లంకొండ వరకు రూ.149 కోట్ల నిధులతో సాధించిన డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా ఊటుకూరు కప్పలవాగు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.





కప్పలవాగు వద్ద నిర్మాణంలో ఉన్న హైలెవల్ బ్రిడ్జి

గతంలో మరిచారు..

గతంలో క్రోసూరు నుంచి సత్తెనపల్లి వైపు వెళ్లే మార్గంలో ఐదు లోలెవల్ బ్రిడ్జిలు ఉండేవి. మూడు క్రోసూరు మండలంలో, రెండు సత్తెనపల్లి మండలం పరిధిలో ఉన్నాయి. కొద్దిపాటి వర్షాలకే.. వాగులు పొంగి బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు రెండుమూడు రోజుల పాటు నిలిచిపోయేవి. 20 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం వాటి స్థానంలో 5 హై లెవల్ బ్రిడ్జిల నిర్మించింది. సత్తెనపల్లి వైపు రాకపోకల సమస్యలు తీరిపోయాయి. అయితే అప్పట్లో ఊటుకూరు కప్పల వాగు సమస్యను ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. ఏది ఏమైనప్పటికీ త్వరితగతిన ఊటుకూరు కప్పల వాగు వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసుకుంటే ప్రయాణికుల కష్టాలు తీరుతాయని పలువురు కోరుకుంటున్నారు.

భారీ వర్షంతో ఇక్కట్లు

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం భారీగా వర్షాలు కురిసాయి. మండల కేంద్రానికి దక్షిణ దిక్కుగా ఉన్న వీరపట్నం, అన్నవరప్పాడు, రైతు నగర్ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. అధిక వర్షంతో డ్రెయిన్లు పొంగిపొర్లి రోడ్లు జలమయమయ్యాయి. దాదాపు రెండు గంటల పాటు మోకాళ్ల లోతు నీరు పారింది.